క్లుప్తంగా

ఉత్తమ సేవలకు పురస్కారం


సేవారత్న అవార్డు అందుకుంటున్న నరసింహులు(ఫైల్)

తంబళ్లపల్లె: ఫోర్డు సంస్థ ఆధ్వర్యంలో బాలల హక్కుల ఐక్యవేదిక కన్వీనర్ నరసింహులు పేద,బడుగు వర్గాల అభివృద్ధికి చేసిన సేవలకు సేవారత్న ప్రతిభా అవార్డు దక్కింది. 25 సంవత్సరాలుగా నియోజకవర్గంలోని పేద, బడుగు, బలహీనవర్గాల్లో బాల సంఘాలు, మహిళా ,పురుష సంఘాలను ఏర్పాటు చేసి వారికి సామాజిక, రాజకీయ, విద్య రంగాలపై పలు సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా చైతన్యపచడం జరిగింది. తిరుపతి మార్ప్ జానపద, సాంస్కృతిక కళా సంస్థ నరసింహులు ఈ పురస్కారానికి ఎంపిక చేశారు. ఇటీవల తిరుపతిలోని వేమన విజ్ఞాన కేంద్రంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో నరసింహులును శాలువతో సత్కరించారు. మార్ప్ నిర్వాహకులు దళవాయి గుర్రప్ప అవార్డును అందజేశారు. ఫోర్డు డైరెక్టర్ లలితమ్మకు కృతజ్ఞతలు తెలిపారు.

మిట్స్ విద్యార్థులకు హెచ్‌డీఎఫ్‌సీ స్కాలర్‌షిప్‌లు


స్కాలర్‌షిప్‌లు అందుకున్న విద్యార్థులు

కురబలకోట: అంగళ్లులోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల ఎంసీఏ విద్యార్థులు డొడ్ల దీప్తి, నాదెండ్ల గిరి, బి. సహిత, కంసల సంధ్యారాణికి హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు పరివర్తన్ ఈసీఎస్ఎస్ కింద ఒక్కొక్కరికి రూ.35 వేలు చొప్పున స్కాలర్‌షిప్ అందజేసినట్లు ప్రిన్సిపాల్ యువరాజ్ తెలిపారు. మెరిట్‌ను పరిగణలోకి తీసుకుని స్కాలర్‌షిప్ అందజేసినట్లు తెలిపారు. విద్యార్థులను ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.

ఈసీసీఈపై అవగాహన


పిల్లల ప్రదర్శనను తిలకిస్తున్న అధికారులు

తంబళ్లపల్లె: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం ఐసీడీఎస్ సీడీపీఓ నాగవేణి ఆధ్వర్యంలో ఈసీసీఈ (ఎర్లీ చైల్డ్ హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్)పై అవగాహన సదస్సు నిర్వహించారు. పిల్లలు పుట్టినప్పటి నుంచి ప్లే స్కూల్ ఎడ్యుకేషన్ వరకు వారి పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తల్లులకు అవగాహన కలిగించారు. ప్రీ స్కూల్ కార్యక్రమాల ద్వారా పిల్లల్లో జరిగే సమగ్రాభివృద్ధిపై అవగాహన కల్పించారు. పిల్లలు గణితాభివృద్ధి, ప్రీస్కూల్ కార్యక్రమాల ద్వారా నేర్చుకున్న అంశాలను ప్రదర్శించడంతో అధికారులు తల్లులు సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఉపేందర్‌రెడ్డి, ఎంఈఓ త్యాగరాజు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

పింఛన్ల పునఃపరిశీలన

పీలేరు : వందశాతం అంగవైకల్యం కలిగిన పింఛన్ల లబ్ధిదారుల గుర్తింపుపై మండలంలో పునఃపరిశీలన ప్రారంభించారు. సోమవారం పీలేరు పట్టణంలోని పలువురు లబ్ధిదారుల ఇంటికి వెళ్లి వారి వివరాలు సేకరించారు. కడప నుంచి వచ్చిన రిమ్స్ వైద్యబృందం అంగవైకల్యాన్ని అంచనా వేశారు. సేకరించిన వివరాలు ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు. కార్యక్రమంలో రిమ్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ ఆనంద్, డాక్టర్ మనోహర్, ఇన్‌చార్జి ఎంపీడీవో లతీఫ్‌ఖాన్. పీలేరు ప్రభుత్వాస్పత్రి సూపరింటిండెంట్ డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్, డాక్టర్ రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దైవ సేవకురాలు లలితమ్మ మృతి


లలితమ్మ (ఫైల్)

కురబలకోట: తంబళ్లపల్లె నియోజక వర్గంలో పెద్దదైన అంగళ్లు సీయోను ప్రార్థన మందిరం ప్రధాన దైవ సేవకులు డాక్టర్ విక్టర్ వేదనాయకం తల్లి లలితమ్మ (78) సోమవారం మృతి చెందింది. ఈమె ఆకస్మిక మృతి పట్ల సంఘంతో పాటు విశ్వాసులు దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. అనంతపురం జిల్లా ఉరవకొండకు చెందిన ఈమె 22 ఏళ్ల పాటు ప్రభుత్వ టీచర్‌గా పనిచేశారు. ఉరవ కొండ ప్రాంతంలో దేవుని సేవలో గడిపారు. అంగళ్లులోని సీయోను ప్రార్థన మందిరంలో కూడా ఎంతగానో దేవుని సేవ చేశారు. వాక్య పరిచర్య, స్త్రీల కూడికలు నిర్వహించారు. ఈమె స్త్రీల ఆత్మీయ అలంకరణలు, ప్రభువు మెచ్చే అలంకరణలు తదితర పుస్తకాలు రాశారు. ఆఖరి వరకు కూడా దేవుని సేవలో ఉంటూ గొప్ప సాక్షిగా ధన్యురాలిగా నిలచింది. అంగళ్లు ప్రాంతంలో ఆమె చేసిన సేవను విశ్వాసులు తలచుకుంటున్నారు.

కోతులు, కుక్కలతో పర్యాటకులు బెంబేలు


ఘాట్‌రోడ్డుపై వానర గుంపు


హార్సిలీహిల్స్‌పై సంచరిస్తున్న కుక్కలు

- ఆహారం కోసం వాహనాలపైకి ఎగబడుతున్న వైనం
- ఘాట్‌రోడ్డులో తరచూ ప్రమాదాలు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న హార్సిలీహిల్స్ పర్యాటకులు

బి.కొత్తకోట: మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్ వచ్చే సందర్శకులు వానరాలు, గ్రామ సింహాల దెబ్బకు హడలిపోతున్నారు. వీటి ప్రమాదాలు జరుగుతుండటంతో అతి జాగ్రత్తగా ఉండాల్సివస్తోంది. కాండ్లమడుగు నుంచి కొండపైకి తొమ్మిది కిలోమీటర్ల ఘాట్‌రోడ్డు ఉంది. ఈ మధ్యలో కొంతమంది తామేదో ఘనకార్యం చేస్తున్నట్టుగా వ్యర్థ పదార్థాలను తీసుకొచ్చి ఘాట్‌రోడ్డుపై వానరాలకు వేస్తున్నారు. దీనితో అవి స్వతహాగా ఆహారం సేకరించడం మానుకొని..బైక్, కార్లలో పైకి, కిందకు వచ్చిపోయే వారిపై మీదకు వస్తున్నాయి. ఆహారం కోసం ఎగబడుతూ ఆందోళన కలిగిస్తున్నాయి. దీనివల్ల పలుమార్లు బైక్ ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. బాధితులు కుయ్యో మొర్రో అంటూ పడిలేచి బతుకుజీవుడా అని హార్సిలీహిల్స్‌కు వద్దురా బాబు అంటూ వెళ్తున్నారు. ఘాట్‌రోడ్డుపై ప్రయాణాలు సాగించే సందర్శకులు ఎంతో జాగ్రత్తగా వ్యవహరించాల్సి ఉంది. వానరాలు మీద పడకుండా, బైక్‌పై వెళ్లే వారు అప్రమత్తంగా ఉండాలి. ఇక హార్సిలీహిల్స్‌పై ఎప్పుడూ లేని విధంగా ఎవరూ చూడని విధంగా గ్రామ సింహాలు స్వైరవిహారం చేస్తున్నాయి. ఈ గుంపు అధికం కావడంతో రోడ్లపై ఎక్కడ చూసిన ఇవే. స్థానిక జనాభా కంటే మా సంఖ్యే ఎక్కువ అని ధీమా సంచరిస్తూ సందర్శకులను హడలెత్తిస్తున్నాయి. సందర్శకులు కనిపిస్తే చాలు వారివెంట పడుతూ పరుగులు తీయిస్తున్నాయి. కొండపైకి కార్లు, బైక్‌లపై చేరుకునే వారు సరదాగా నడుస్తూ ప్రకృతి అందాలను తిలకిస్తారు. వీరి వెంట మేమున్నామంటూ గ్రామ సింహాలు వెంటపడుతున్నాయి. ఆహార పదార్థాలు కనిపిస్తే చాలు మాకు అంటూ నోటిని పైకెత్తి మీదపడతుంటాయి. దీనితో సందర్శకులు ఇదేం గొడవరా బాబు హాయిగా ప్రశాంతంగా కాసేపు గడుపుదామని వస్తే వీటి గోల ఏందని అసహనం వ్యక్తం చేస్తున్నారు. దీనితో కొండపై సందర్శకుల పర్యటన సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసుకుంటూ గదుల్లోకి వెళ్లిపోవడం లేదంటే వెనుదిరగడం జరిగిపోతున్నాయి. ఈ ఇబ్బందులపై అధికారులు స్పందించకపోవడం వల్లే పరిస్థితి ఇంతదాక వచ్చింది. ఈ అవస్థలపై కలెక్టర్ స్పందిస్తే కాని సమస్య పరిష్కారం అయ్యే మార్గం కనిపించడం లేదు. అన్నమయ్య జిల్లాలో ఏకైక పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్. ఇది తప్ప మరో పర్యాటక కేంద్రం లేదు. కాాబట్టి అధికారులు హార్సిలీహిల్స్ సమస్యలపై చిత్తశుద్ధితో స్పందించాలి. ప్రస్తుతం సందర్శకులు, స్థానికులు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో హార్సిలీహిల్స్‌పై ఏర్పాటైన సౌకర్యాలు, ఇప్పటి పరిస్థితులపై బేరీజు వేసుకుంటున్నారు. గత ప్రభుత్వమే మేలని బహిరంగంగా చెప్పుకొంటున్నారు. అంటే ఇక్కడి పరిస్థితులు ఎలా ఉన్నాయో చెప్పకనే చెబుతున్నాయి.

తురకపల్లెలో మౌలికవసతులు కల్పించండి

- పీజీఆర్ఎస్‌లో సబ్‌కలెక్టర్‌కు గ్రామస్థుల వినతి
- రెవెన్యూ సమస్యలపై వెల్లువెత్తిన ఫిర్యాదులు


ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న సబ్ కలెక్టర్ మేఘస్వరూప్

మదనపల్లె : శానిటోరియం లోకల్ అథారిటీలోని తురకపల్లెలో మౌలిక వసతులైన కాలువలు, సీసీ రోడ్లు లేక ఇబ్బందులు పడుతున్నామని, తమ అవస్థలను పట్టించుకోండంటూ గ్రామస్తులు సబ్ కలెక్టర్‌కు అర్జీ సమర్పించారు. సబ్ కలెక్టరేట్‌లో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా తురకపల్లె గ్రామస్తులు సబ్ కలెక్టర్‌ను కలిసి పదేళ్లుగా కనీసవసతులు కోరుతూ అర్జీలు సమర్పిస్తున్నా తమను పట్టించుకున్న నాథుడు లేదని వాపోయారు. రోడ్లపై మురికి నీరు ప్రవహిస్తుండటంతో తాగునీరు కలుషితమవుతూ, ప్రజలు ఆరోగ్యసమస్యలతో బాధపడుతున్నారన్నారు. తురకపల్లె శానిటోరియం లోకల్ అథారిటీలో ఉన్నందున తహసీల్దార్, ఎంపీడీఓలు అభివృద్ధి పనులకు తమకు సంబంధం లేదన్నారన్నారు. శానిటోరియం లోకల్ అథారిటీలో అభివృద్ధికి సంబంధించి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. కలికిరి టీటీడీ కల్యాణమండపం పక్కన ఇళ్ల మధ్య అనుమతి లేకుండా మంజునాథ కోళ్లఫారం పెట్టారని, దీంతో స్థానికులు ఆరోగ్యసమస్యలు ఎదుర్కొంటున్నామని సత్యపురం గ్రామస్తులు ఫిర్యాదుచేశారు. తండ్రి పేరుపై ఉన్నటువంటి ప్రభుత్వభూమిని, ఆయన మరణాంతరం తమపేరు మీదకు మార్చాలని కుటుంబసభ్యులు అర్జీ పెట్టుకుంటే, తహసీల్దార్, వీఆర్వో కలిసి రెవెన్యూ రికార్డుల నుంచి తమ తండ్రి పేరు తొలగించేశారని నక్కలదిన్నె తాండాకు చెందిన మంజుల, సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదుచేసింది. పొన్నేటిపాళెం రెవెన్యూ గ్రామం.సర్వేనెం.483/27లో 0.66 సెంట్లు తమ తండ్రి పేరు మీద ఉండటమే కాకుండా పాసుపుస్తకం, 1బి అడంగల్ ఉన్నాయన్నారు. 35 ఏళ్లుగా భూమి తమ అనుభవంలో ఉందన్నారు. కిందటి ఏడాది అక్టోబర్ వరకు ఆన్‌లైన్‌లో తమ తండ్రి పేరు మీద ఉన్నటువంటి భూమిని, వీఆర్వో, తహసీల్దార్‌లు వారసులు లేరని ప్రభుత్వభూమిగా పేర్కొని రికార్డుల నుంచి తొలగించేశారన్నారు. తమకు తండ్రి నుంచి వారసత్వంగా వచ్చిన భూమి తప్ప వేరే ఆస్తులు లేవని, తండ్రి పేరు మీద మంజూరైన భూమిని తమ పేరుమీద రెవెన్యూ రికార్డుల్లోకి ఎక్కించి, పాసుపుస్తకాలు మంజూరుచేయాలని కోరారు. అలాగే రెవెన్యూ సమస్యలు పరిష్కారం కాలేదని, సర్వేయర్లు భూమి కొలిచేందుకు రావడం లేదని, రికార్డుల్లో తప్పుగా నమోదు చేశారని, ప్రభుత్వస్థలం ఆక్రమణకు గురైందని పలువురు అర్జీలు సమర్పించారు. ప్రజల సమస్యలను తెలుసుకుని, అర్జీలు స్వీకరించిన సబ్ కలెక్టర్ వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుని, నిర్దేశిత సమయంలోపు నివేదిక అందజేయాల్సిందిగా సంబంధిత అధికారులను ఆదేశించారు.

కలెక్టర్ సొంత నిధులతో 350 కార్పెట్‌లు


కార్పెట్‌లను విద్యార్థలకు అందజేస్తున్న ఎంఈఓ, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

కలకడ : పాఠశాల తనిఖీ సందర్భంలో విద్యార్థులు చలికి పడుతున్న కష్టాలను జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్‌కు తెలియజేశారు. స్పందించి కలెక్టర్ తన సొంత నిధులతో విద్యార్థినులకు పాఠశాలలో అవసరమైన 350 కార్పెట్‌లను వితరణ చేశారు. గత ఏడాది నవంబర్ మాసం 23న కలకడ మండలం, కె.బాటవారిపల్లె పంచాయతీ గరుడప్ప గారిపల్లెలోని బాలికల గురుకుల పాఠశాలను కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. త్రీఫేస్ విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో నీటి శుద్ధి యంత్రం వినియోగంలో లేదని సిబ్బంది తెలిపారు. వెంటనే పాఠశాలకు త్రీఫేస్ విద్యుత్ సౌకర్యం కల్పించాలని విద్యుత్ శాఖ అధికారులను అప్పుడు కలెక్టర్ ఆదేశించారు. వారంలోపే త్రీఫేస్ విద్యుత్ సౌకర్యం కల్పించి ఆర్‌ఓ ప్లాంట్‌ను వినియోగంలోకి తీసుకువచ్చారు. అలాగే అప్పుడు విద్యార్థినిలకు ఇచ్చిన హామీ మేరకు కలెక్టర్ తనసొంత నిధులతో 350 కార్పెట్‌లు కొనుగోలు చేసి పాఠశాలకు పంపించారు. వాటిని సోమవారం ఎంఈఓ మునీంద్ర నాయక్ విద్యార్థినులకు అందజేశారు. కార్యక్రమంలో సచివాల యసిబ్బంది నాగభూషణ్, బాలాజీ, ప్రిన్సిపాల్ సుమిత్ర, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని కలెక్టర్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

బర్త్ సర్టిఫికేట్ ఇవ్వలేదని నిరసన

మదనపల్లె : బిడ్డ బర్త్ సర్టిఫికేట్ ఇచ్చేందుకు సిబ్బంది నిరాకరిస్తున్నారంటూ తండ్రి శివకుమార్, బంధువులతో కలిసి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట నిరసన తెలిపాడు. నిమ్మనపల్లె మండలం రాచవేటివారిపల్లె పంచాయతీ ఎగువమాచిరెడ్డిగారిపల్లెకు చెందిన శివకుమార్ భార్య వరలక్ష్మి(26)కు ఈనెల 4 రాత్రి ప్రసవ నొప్పులు అధికం కావడంతో 108కు ఫోన్‌చేశారు. వారు వచ్చి ఆమెను వాహనంలో ఆస్పత్రికి తీసుకువెళుతుండగా, మార్గమధ్యంలో నొప్పులు ఎక్కువై వరలక్ష్మి 108 వాహనంలో ప్రసవించింది. ప్రసవానంతర పరీక్షల కోసం ఆమెను అదే వాహనంలో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రి సిబ్బంది ఆమెను అడ్మిట్ చేసుకుని శని, ఆది రెండురోజుల పాటు చికిత్స అందించి సోమవారం డిశ్చార్జి చేశారు. అదే సమయంలో శివకుమార్, తన బిడ్డకు బర్త్ సర్టిఫికేట్ ఇవ్వాల్సిందిగా జిల్లా ఆస్పత్రి సిబ్బందిని కోరాడు. అయితే వారు బిడ్డ 108 వాహనంలో పుట్టినందున, జిల్లా ఆస్పత్రిలో పుట్టినట్లుగా సర్టిఫికేట్ ఇవ్వలేమని తేల్చి చెప్పారు. దీంతో బిడ్డ తండ్రి బర్త్ సర్టిఫికేట్‌కు తాము ఎక్కడ ఇబ్బందులు పడేదంటూ ఆస్పత్రి ఎదుట నిరసన వ్యక్తం చేశాడు. తర్వాత ఆస్పత్రి సిబ్బంది 108లో ప్రసవం జరిగినట్లుగా సిబ్బంది ధృవీకరిస్తూ ఇచ్చిన సర్టిఫికేట్ సచివాలయంలో అందజేసి బర్త్ సర్టిఫికేట్ పొందవచ్చని చెప్పడంతో నిరసన విరమించాడు.

దివ్యాంగుల్లో ఆందోళన


వెరిఫికేషన్ చేస్తున్న వైద్య బృందం

పెద్దతిప్పసముద్రం: పింఛన్‌దారుల పొట్ట కొట్టేందుకు కూటమి సర్కార్ కుట్రలు పన్నుతోంది. వెరిఫికేషన్ పేరుతో ప్రత్యేక వైద్య బృందంతో సర్వే చేయిస్తోంది. ఈ నేపథ్యంలో వైఎస్సార్ కడప రిమ్స్ ఆసుపత్రికి చెందిన వివిధ వైద్య విభాగాల బృందం సభ్యులు ఎంపీడీఓ, ఆయా ఏరియా పీహెచ్‌సీ డాక్టర్లు, పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లతో కలసి నెలకు రూ.15 వేల దివ్యాంగ పింఛన్ సొమ్ము పొందుతున్న ఇళ్లకు వెళ్లి పర్యవేక్షిస్తున్నారు. మండలంలోని మొత్తం 20 గ్రామ పంచాయతీల్లో కేవలం 70 మంది మాత్రమే రూ.15 వేల పింఛన్ సొమ్ము అందుకుంటున్నారు. వీరు అర్హులా లేదా, వీరంతా మంచానికే పరిమితం అయ్యారా అని అధికారులు ఆరా తీస్తున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం కడప వైద్యులు రాంమోహన్, సునీలదత్‌లతో పాటు ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్, పీహెచ్‌సీ డాక్టర్లు శంకర్, ఎండీ యస్దానీ తదితరులు మండలంలో విస్తృతంగా పర్యటించారు.

వైకుంఠ ఏకాదశికి వసతులు కల్పించాలి

– సబ్ కలెక్టర్ మేఘస్వరూప్


వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లపై అధికారులతో చర్చిస్తున్న సబ్ కలెక్టర్ మేఘస్వరూప్

మదనపల్లె : వైకుంఠ ఏకాదశి సందర్భంగా శ్రీ ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా అన్ని వసతులు కల్పించాలని సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ అన్నారు. సోమవారం సబ్ కలెక్టరేట్‌లో వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లకు సంబంధించి ఎండోమెంట్, మున్సిపల్, రెవెన్యూ, పోలీస్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ మాట్లాడుతూ... వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా స్వామివారిని దర్శించుకునేందుకు, ఉత్తర ద్వార దర్శనానికి 50వేల మందికి పైగా భక్తులు వస్తారని అంచనాలు ఉన్న నేపథ్యంలో తదనుగుణంగా అధికారులు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. భక్తులకు ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, తోపులాటలు లేకుండా ఆధ్యాత్మిక వాతావరణంలో స్వామివారిని దర్శించుకునేలా చూడాలన్నారు. క్యూలు, చలువపందిళ్లు, తాగునీరు, వైద్యసౌకర్యాలు, మరుగుదొడ్లు తదితర వసతులు కల్పించాలన్నారు. పోలీస్, రెవెన్యూ, మున్సిపల్, ఎండోమెంట్ అధికారులు సమన్వయంతో పనిచేసి, వారి వారి విధులు సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. ఆలయ పరిసరాల్లో ప్రత్యేక పారిశుధ్యపనులు నిర్వహించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు గోవర్ధన్‌భట్టార్, సబ్ కలెక్టర్ మేఘస్వరూప్‌ను ఆలయ మర్యాదలతో సత్కరించి, ఆశీర్వచనాలు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కే.ప్రమీల, తహసీల్దార్ ఖాజాబీ, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ రమేష్‌బాబు, ఎండోమెంట్ అధికారులు అంకన్న, రాజశేఖర్, ఫైర్ ఆఫీసర్ శివయ్య, సీఐలు రమేష్, ఎస్ఐ హరిహరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధి సలహా సంఘం సభ్యుడిగా హబీబ్‌బాషా


హబీబ్‌బాషాను సత్కరిస్తున్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

పీలేరురూరల్ : జిల్లా అభివృద్ధి సలహా సంఘం సభ్యుడిగా పీలేరు సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా రెండో సారి ఎంపికయ్యారు. జిల్లాలో కేంద్ర ప్రభుత్వం నిధులతో జరుగుతున్న అభివృద్ధి పనులను ఈ కమిటీ పర్యవేక్షిస్తుంది. కమిటీలో సభ్యునిగా స్థానం పొందడంతో సోమవారం తిరుపతిలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కలసి హబీబ్‌బాషా కృతజ్ఞతలు తెలిపారు. అలాగే రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డికి, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి సమష్టిగా కృషి చేస్తాం


శ్రీఖర్‌రెడ్డి, యోగేంద్ర, నారే వెంకటరమణారెడ్డి, రాంప్రసాద్‌నాయుడు, కుమార్‌నాయుడు


ఆనంద్ జయరామచంద్రయ్య

పీలేరు : వైఎస్సార్ సీపీ బలోపేతానికి సమష్టిగా కృషి చేస్తామని జిల్లా కమిటీలో పదవులు పొందిన నాయకులు పేర్కొన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ అన్నమయ్య జిల్లా కమిటీని ప్రకటించారు. ఇందులో పీలేరు నియోజకవర్గానికి పలువురికి పదవులు వరించాయి. అన్నమయ్య జిల్లా వైఎస్సార్‌సీపీ వైస్ ప్రెసిడెంట్ నల్లారి శ్రీఖర్‌రెడ్డిని నియమించారు. అలాగే జనరల్ సెక్రటరీ యోగేంద్ర, ఆర్గనైజేషన్ సెక్రటరీలుగా నారే వెంకటరమణారెడ్డి, రాంప్రసాద్‌నాయుడు, యాక్టివిటీ సెక్రటరీలుగా కుమార్‌నాయుడు, ఆనంద్, అధికార ప్రతినిధిగా గుండ్లూరు జయరామచంద్రయ్యను నియమించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీకి పునర్‌వైభవం తీసుకొచ్చేందుకు కృషి చేస్తామని తెలిపారు. తమకు పదవులు కల్పించడానికి సహకరించిన మాజీ మంత్రిపెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం


క్రికెట్ టోర్నీ ప్రారంభిస్తున్న హెల్పింగ్‌మైండ్స్ సభ్యులు

మదనపల్లె సిటీ: క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని హెల్పింగ్‌మైండ్స్ వ్యవస్థాపకులు అబుబకర్‌సిద్దిక్ అన్నారు. సోమవారం స్థానిక బీటీ కాలేజీ మైదానంలో సుకుమార్ మెమోరియల్ టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంటు జరిగింది. విద్యార్థి దశ నుంచే క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. పోటీల్లో గెలుపు,ఓటములు సహజమన్నారు. దీన్ని స్పోర్టివ్‌గా తీసుకోవాలన్నారు. ఇలాంటి పోటీలు నిర్వహించడంతో స్నేహభావం పెరుగుతుందన్నారు. గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎంబి టమటా మండీ నిర్వాహకులు, మస్తాన్, పృథ్వి తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనదారుడిని ఢీకొన్న ఆటో

గాలివీడు : మండల కేంద్రంలోని గ్రామీణ బ్యాంకు వద్ద ద్విచక్ర వాహనదారుడు సాయిప్రతాప్‌రెడ్డిని ఆటో ఢీ కొన్న సంఘటన సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు గోపనపల్లె గ్రామం చీపరమోళ్లపల్లెకు చెందిన సాయి ప్రతాప్ రెడ్డి బస్టాండ్ నుంచి గేటు వైపు వెళుతుండగా ఎదురుగా వస్తున్న ఆటో ఢీ కొనడంతో సాయిప్రతాప్ రెడ్డి కుడికాలు విరిగింది. మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు బంధువులు తెలిపారు.

వాటర్‌షెడ్ పనుల తనిఖీ


వాటర్‌షెడ్ పనులను పరిశీలిస్తున్న ఏపీడీ

పెద్దమండ్యం: వాటర్‌షెడ్ ద్వారా చేపడుతున్న అభివృద్ధి పనులను ఏపీడీ లక్ష్మీనరసయ్య సోమవారం పరిశీలించారు. మండలంలోని పెద్దమండ్యం వాటర్‌షెడ్ పరిధిలో జరుగుతున్న ఫాంపాండ్ రాతికట్టడాల పనులను ఆయన తనిఖీ చేశారు. చెరువుకిందపల్లెకు సమీపంలో వాటర్‌షెడ్ ద్వారా గత రెండు రోజులుగా పనులను చేపట్టారు. నిబంధనల మేరకు పనులు పూర్తి చేయాలని ఆయన సూచించారు. వర్షం నీటిని నిలువరించేందుకు ఫాంపాండ్ పనులను విరివిగా చేపట్టాలని ఆదేశించారు. ఏపీడీ వెంట వాటర్‌షెడ్ సిబ్బంది మోహన, ఢిల్లీబాబు పాల్గొన్నారు.

మార్మోగిన గోవింద నామస్మరణ


తిరుమలకు బయల్దేరిన గోవింద మాల స్వాములు

సుండుపల్లె : మండల కేంద్రం సోమవారం గోవింద నామస్మరణలతో మార్మోగింది. మండలంలో గోవిందమాల ధరించిన భక్తులు తిరుమలకు 16వ సారి మహా పాదయాత్రను సుండుపల్లెలోని విరూపాక్ష ఆలయం నుంచి ప్రారంభించారు. వంద కిలో మీటర్ల మేర సాగే ఈ పాదయాత్రల్లో మాలధారులు వందలాదిగా పాల్గొన్నారు. మండల కేంద్రంలోని వీధులు భక్తులతో కిక్కిరిసి కనిపించింది. పాదయాత్రలో స్వామి వారి చిత్రపటాన్ని చేతపట్టుకొని సాగడంతో ప్రత్యేక శోభ చేకూరింది. పాదయాత్ర సాగే దారి వెంబడి స్వామి వారి చిత్రపటానికి భక్తులు హారతులు పట్టి టెంకాయలు కొట్టి భక్తిని చాటారు. వైకుంఠ ఏకాదశికి తిరుమలకు చేరుకొని వెంకటేశ్వర స్వామిని దర్శించుకోవడమే లక్ష్యంగా బయలుదేరారు.

గోకులాలను పూర్తిచేయాలి

రామాపురం : మండలంలోని 13 గ్రామ పంచాయతీల్లో నిర్మాణంలో ఉన్న గోకులాలను ఏపీఓ పెంచలయ్య, ఈసీ శివయ్యలు సిబ్బందితో కలిసి సోమవారం నల్లగుట్టపల్లి, సుద్దమళ్ల గ్రామాలను పరిశీలించారు. కుమ్మరపల్లె, బండపల్లి గ్రామాలను ఈసీ శివయ్య పరిశీలించిన అనంతరం మాట్లాడుతూ ఉపాధి నిధుల ద్వారా మండలంలో 74 గోకులాలను మంజూరు కావడంతో అందులో 39 పూర్తికాక మిగిలిన వాటిలో 14 గునాది నిర్మాణంలో, 16 రూఫ్ స్థాయి ఉన్నట్లు తెలిపారు. ఒక్కో గోకులానికి రూ.2.30లక్షలు మంజూరు చేసినట్టు అధికారి తెలిపారు.

కార్మికుల సంఘాలతో ఉపయోగం


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారి డి.కృష్ణ

రాయచోటి (జగదాంబసెంటర్) : చేనేత కార్మికులకు ప్రభుత్వ పథకాలు అమలు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని అన్నమయ్య జిల్లా చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకులు డి.కృష్ణ వెల్లడించారు. సోమవారం చేనేత కార్మిక యూనియన్ ముద్రించిన 2025 సంవత్సరపు క్యాలెండర్‌ను ఆయన రాయచోటిలోని ఆ శాఖ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డి.కృష్ణ మాట్లాడుతూ చేనేత కార్మికులకు ఇలాంటి సంఘాల వల్ల ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. గత 34 సంవత్సరాలుగా చేనేత కార్మికుల సంక్షేమము మరియు ఉపాధి, చేనేత రంగ రక్షణకు చేనేత కార్మిక యూనియన్ చేనేత నాయకులు పనిచేస్తున్నారని, వారి కృషి అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో అధికారులు వెంకట్‌కుమార్, ప్రవీణ్‌కుమార్‌రాజు, చేనేత కార్మిక యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆకుల వాసు, రాష్ట్ర ఉపాధ్యక్షులు రామమోహన్, రాష్ట్ర కార్యదర్శి గురుస్వామి, అన్నమయ్య జిల్లా అధ్యక్షులు గుంపు వెంకటేష్, జిల్లా ఉపాధ్యక్షులు వెంకటేష్, శ్రీరామకృష్ణ, శంకారపు రామచంద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుమలేష్, తంబళ్లపల్లి అధ్యక్షులు అనంత ఈశ్వరయ్య, చేనేత కార్మికులు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

వీరబల్లి : మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు సోమవారం ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మాట్లాడుతూ వీరబల్లి ఒక యూనిట్‌గా తీసుకొని 20 సెంట్ల విస్తీర్ణంలో ప్రకృతి వ్యవసాయం ఎలా చేయాలన్నది విద్యార్థులకు తెలియజేశారు. ఇందులో భాగంగా దుక్కిచేసి దుక్కిలో ఘన జీవామృతం వేసి తరువాత మొక్కజొన్న, క్యారెట్, మిరప, టమాటా వంటి విత్తనాలను బీజామృతంతో విత్తన శుద్ధి చేసి విత్తనాలు నాటారు. అనంతరం ఈ విధానాన్ని ఎలా పాటించాలో, క్రిమీ సంహారక మందుల వినియోగంపై విద్యార్థులకు తెలియజేశారు.

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం

సిద్దవటం : మండలంలోని టక్కోలు గ్రామ సమీపంలోని పెన్నానది నుంచి ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నామని ఏఎస్ఐ సుబ్బరామచంద్రుడు తెలిపారు.

ఆలయ భూముల పరిశీలన


ఓదివీటమ్మను దర్శించుకుంటున్న విశ్వనాథ్

రాయచోటి టౌన్ : ఓదివీడు గ్రామంలో వెలసిన ఓదేటమ్మ ఆలయ మాన్య భూములు సుండుపల్లెలో ఉండటంతో జిల్లా దేవాదాయ అధికారి విశ్వనాథ్ ఆలయాన్ని సోమవారం సందర్శించారు. రాయచోటి, రాజంపేట డివిజన్ పరిధిలో అమ్మవారి మాన్యాలను పరిశీలించగా భూములు సుండుపల్లెలో సర్వేనెంబరులో 5.14 ఎకరాలు ఉన్నట్లు తెలిసిందని, ఈ భూమిని పరిశీలించినట్టు ఆయన పేర్కొన్నారు. గ్రామ పెద్దలతో కలిసి ఆలయ చరిత్రను, విశిష్టతను అడిగి తెలుసుకున్నారు. ఆలయ మాన్యాన్ని కాపాడేందుకు కృషి చేస్తామని చెప్పారు. అనంతరం గ్రామంలో వెలసిన శ్రీ సీతారామాంజనేయ స్వామి వార్లను ఆయన దర్శించుకున్నారు.